క్లుప్తంగా

కొనసాగుతున్న ఉత్సవాలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

మాడ్గుల: మండల పరిధి దిల్వార్‌ఖాన్‌పల్లిలో శ్రీ భూనీల సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం స్వామివారికి విశేష అభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాడ్గుల: మండల పరిధి నాగిళ్ల గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. మారుమూల ప్రాంతాలకు సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు మండల, జిల్లా కేంద్రంలోని పాఠశాల, కళాశాలలకు వెళ్లలేక పోతున్నారని పేర్కొన్నారు. ప్రజల అవసరాల మేరకు బస్సులను తిప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాలకుర్ల రఘుపతి గౌడ్, నాయకులు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం



శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కమిషనర్ శంకర్‌నాయక్‌ను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం విఠాయిపల్లి గ్రామంలో కమిషనర్ పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, చంద్రు నాయక్, వెంకట్‌రెడ్డి, రవినాయక్, పర్వతాలు, రవీందర్‌నాయక్, సాంబశివరావ్ పాల్గొన్నారు.

నూతన నియామకం



ఎమ్మెల్యే మల్‌రెడ్డితో పార్టీ మహిళా నేతలు

మంచాల: కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలిగా మండల పరిధి ఆగాపల్లి గ్రామానికి చెందిన లకుమల కల్పన నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నగరంలో ఆమెకు పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీజ్యోతి, ఇన్‌చార్జి లక్ష్మమ్మ నియామక పత్రం అందజేశారు. అదే విధంగా ఏ– బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా ఆగాపల్లికి చెందిన దూసరి లావణ్య గౌడ్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో మహిళా నేతలు.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పని చేసే వారికి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలశివుడు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో స్వీయ రక్షణ



విద్యార్థులను అభినందిస్తున్న ఫిరోజ్ ఖాన్

పహాడీషరీఫ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ ఫిరోజ్ అన్నారు. సయ్యద్ రఫిక్ స్మారకార్థం వెంకటాపూర్‌లో మంగళవారం కరాటే పోటీలు నిర్వహించారు. టైగర్ షాటోకాన్ కరాటే అకాడమీ నిర్వాహకుడు జాఫర్ అలీఖాన్ ఆధ్వర్యంలో జరిగిన మూడో రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన జీనత్ బేగం, ఫర్వీన్‌బేగం, శైకా మరియం, ఆజంను అభినందించారు. స్వీయ రక్షణకు యుద్ధ విద్యలు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

రికవరీకి రంగం సిద్ధం

- ఫార్మాసిటీ భూ పరిహారం చెల్లింపులో భారీగా గోల్‌మాల్
- బినామీ పేర్లతో రూ.కోట్లు స్వాహా
- గుర్తించిన ప్రభుత్వం.. త్వరలో నోటీసులు జారీ
- సహకరించిన అధికారులపై చర్యలు
- ఫార్మా ప్లాట్ల పంపిణీలో జాప్యం



నక్కర్తమేడిపల్లిలో ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్ భూమిలో టీసీఐఐసీ బోర్డు

యాచారం: ఫార్మాసిటీ భూసేకరణ గోల్‌మాల్ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. బినామీల పేరుతో లూటీ అయిన ప్రజాధనాన్ని రికవరీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి తతంగంపై నిగ్గుతేల్చాలని అధికార పార్టీకి చెందిన నేత ఫిర్యాదు నేపథ్యంలో రేవంత్ సర్కార్ ప్రణాళికలు రూపొందించింది. రహస్యంగా ఇంటిలిజెన్సీ ద్వారా నకిలీలు, బినామీల జాబితాను సిద్ధం చేయించింది. యాచారం తహసీల్దార్ కార్యాలయం నుంచి నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించిన భూ రికార్డులు, పరిహారం పొందిన రైతుల వివరాలను స్వాధీనం చేసుకుంది.

టీజీఐఐసీలో 121 గజాల స్థలం

మండల పరిధి నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి 9,851 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించాలని తొలుత నిర్ణయించారు. 7,640 ఎకరాలను సేకరించి, సంబంధిత వ్యక్తులకు పరిహారం అందజేశారు. భూ సేకరణ మొదట్లో(ఎకరాకు) పట్టా భూమికి రూ.12.50 లక్షలు, అసైన్డ్‌కు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న రైతులకు రూ.7.70 లక్షల పరిహారాన్ని అందజేశారు. తర్వాత పట్టా భూములకు బీఆర్‌ఎస్ హయాంలోనే రూ.16 లక్షలు చెల్లించగా.. ప్రస్తుతం రూ.25 లక్షలకు పెంచారు. ఎకరా భూమిని కోల్పోయిన రైతులకు మీరాఖాన్‌పేట టీజీఐఐసీ వెంచర్‌లో 121 గజాల ప్లాట్ల పత్రాలను పంపిణీ చేశారు.

మా పేర్లు చెప్పొద్దు ప్లీజ్!

నకిలీలు, బినామీలకు సహకరించి కోట్లు దండుకున్న అధికారుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో పనిచేసిన ఇద్దరు ఆర్డీఓలు, యాచారం తహసీల్‌లో పనిచేసిన ముగ్గురు తహసీల్దార్లు, 15 మందికి పైగా రెవెన్యూ, సర్వేయర్ సిబ్బంది సహకారంతోనే ఈ వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు ఉంటాయనే సమాచారంతో కొందరు అధికారులు 'మళ్లీ జిల్లాకు వస్తున్నాం. మీకు మరింత పనిచేసి పెడతాం. మా పేర్లు చెప్పొద్దు ప్లీజ్' అంటూ నకిలీలు, బినామీలకు ఫోన్లు చేసి సముదాయిస్తున్నట్లు సమాచారం.

త్వరలో నోటీసులు



భూ సేకరణలో నకిలీలు, బినామీల పేర్లతో పరిహారం పొందిన వారికి నోటీసులు అందజేస్తాం. డబ్బులు రికవరీ చేస్తాం. దీనికి కారణమైన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్లు, కబ్జా ఇచ్చే విషయంలో కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ ఇబ్రహీంపట్నం

గుట్టువిప్పిన గ్రామస్తులు

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో అసైన్డ్, ప్రభుత్వ భూముల్లోనే నకిలీలు, బినామీలు అధికంగా పుట్టుకొచ్చినట్లు అధికారులు గుర్తించారు. మొదట్లో అసైన్డ్ రైతులకు పట్టాదారు, పాసుపుస్తకంలో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం చెల్లించకుండా సాగు యోగ్యమైన భూమికి మాత్రమే చెల్లించారు. కొందరి అధికారుల అండదండలు, బ్రోకర్ల సహకారంతో అసైన్డ్ పట్టాదారు, పాసుపుస్తకాల్లోని మిగులు భూమికి మొత్తం నకిలీ, బినామీలే పరిహారం పొందారు. నెల క్రితం మీరాఖాన్‌పేట టీజీఐఐసీ వెంచర్‌లో ప్లాట్ల సర్టిఫికెట్లు పొందిన రైతుల లిస్టును ఆయా గ్రామాల్లో ప్రకటించారు.



తాడిపర్తి పంచాయతీ గోడకు లబ్ధిదారుల జాబితా

నక్కర్తమేడిపల్లి– 1,601, నానక్‌నగర్– 359, తాడిపర్తి– 545, కుర్మిద్ద– 1,240 మంది వివరాలను పేర్కొంటూ.. జాబితాను గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శించారు. దీని ఆధారంగా గ్రామస్తులే స్వయంగా నకిలీ, బినామీల పేర్లతో కూడిన లిస్టును అధికారులకు అందజేశారు.

3,745 మందికి ప్లాట్లు

నాలుగు గ్రామాల్లో మొత్తం 3,745 మంది ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు పొందిన వారిలో సుమారు 500 మందికి పైగా బోగస్ పేర్లు ఉన్నాయని, వీరందరూ రూ.250 కోట్ల పరిహారంతో పాటు మీరాఖాన్‌పేట టీజీఐఐసీ వెంచర్లలో ప్లాట్ల పత్రాలు పొందినట్లు అధికారులు గుర్తించారు. వీరికి త్వరలో నోటీసులు ఇచ్చి, పరిహారం ఏ హక్కుపై పొందారో.. కాజేసిన డబ్బును చెల్లించకపోతే ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని ఓ రెవెన్యూ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

- పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జీఎల్‌ఎన్‌రెడ్డి



ఎన్నికల సంఘం కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

ఆమనగల్లు: స్థానిక ఎన్నికలు సకాలంలో నిర్వహించకుండా కాలయాపన చేసిన ప్రభుత్వం.. పరీక్షల సమయంలో ఎన్నికలకు వెళ్లడం మంచిది కాదని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. క్లిష్టమైన ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల తరువాతే నిర్వహించాలని సూచించారు. నగరంలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో మంగళవారం సంఘం సంయుక్త కార్యదర్శి జయసింహారెడ్డికి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రనీల్‌చందర్, మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం జీఎల్‌ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టులాంటి పది, ఇంటర్ పరీక్షల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించరాదన్నారు. ఎన్నికలతో విద్యార్థులు ఏకాగ్రత కోల్పోయి, ఒత్తిడికి లోనవుతారని పేర్కొన్నారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ముందుగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి, ఎస్సీలకు తగిన న్యాయం చేసి, ఎన్నికలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజు ముదిరాజ్, రామేశ్వర్‌రెడ్డి, ప్రకాశ్, రమేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల విషప్రచారం

- ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

ఆమనగల్లు: ప్రజాపాలన అందిస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర సభ్యుడు బాలాజీసింగ్ ఆరోపించారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అర్హులందరికీ చేరేలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్.. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి, మోసం చేసిందని, కేసీఆర్ పాలనలో రాష్ట్రం నష్టపోయిందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు అధికార మదంతో వ్యవహరించారని, అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కేటీఆర్, హరీశ్‌రావ్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విపక్షాలు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లులో రైతుదీక్ష కోసం వచ్చే కేటీఆర్.. రైతులకు వారి హయాంలో ఏం చేశారో ముందుగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ సమక్షంలో పలువురు పార్టీలో చేరగా.. ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన నాయకులు హన్మానాయక్, పార్టీ తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, నాయకులు రవికాంత్‌గౌడ్, శ్రీశైలం, అజీమ్, అంజయ్యగుప్తా, ఖలీల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పనైపోయింది

- మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య యాదవ్

యాచారం: 'రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పని అయిపోయింది. దేశంలో, రాష్ట్రంలో ఆ పార్టీలను ప్రజలు నమ్మడం లేదు. తెలంగాణ ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు' అని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో అధికారం చేపట్టిన బీజేపీ.. తెలంగాణపై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, సర్వేలతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రజా సమస్యలను విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, యాదయ్య, జంగయ్యగౌడ్, శ్రీశైలం, శాంతికుమార్, నరేందర్‌గౌడ్, వన్నెవాడ రవీందర్‌రెడ్డి, నీలం రమేష్, పల్లపు నరేష్, పత్తి రాజు, బొడ్డు బాషయ్య, పెద్దులు, గణేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

14న కార్యకర్తల సమావేశం

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14న మండల కేంద్రంలో బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని, సమావేశానికి పార్టీ రాష్ట్ర, జిల్లా నేతలు రానున్నారని, మండల పరిధి నుంచి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

టాస్క్ సీఓఓ రాఘవేందర్‌రెడ్డి



విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం సహకారంతో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల ఎస్‌ఎస్‌సీ విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో ఒత్తిడికి లోనుకాకుండా.. ప్రశాంతంగా రాయాలని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల సూచనలు పాటించాలన్నారు. సదస్సులో పరీక్షలు ఎలా రాయాలి, ఒత్తిడిని ఎలా అధిగమించాలి, ఉత్తమ ఫలితాలు ఎలా సాధించాలి తదితర అంశాలపై మోటివేటర్ మహేందర్‌గురు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. సదస్సులో ఎంఈఓలు పాండు, చాంప్లనాయక్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటయ్య, అల్లాజీగౌడ్, అవ్వారి నిరంజన్, ఆమనగల్లు శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి రమేశ్, సభ్యులు శివలింగం, మహమూద్, సుధీర్‌రెడ్డి, శేఖర్, అశోక్‌రెడ్డి, సువర్ణ, గోవర్ధన్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, అభినవ్‌రెడ్డి, రాజశేఖర్, కొండల్‌రెడ్డి, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

గీత కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

కందుకూరు: కొత్తూర్ గీత కార్మికుల సహకార సంఘం లిమిటెడ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సహకార సంఘం ఎన్నికల అథారిటీ అధికారి ఎండీ రహీముద్దీన్ ఆధ్వర్యంలో మంగళవారం నామినేషన్లు స్వీకరించి కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా తోకల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా పల్లె కృష్ణగౌడ్, డైరెక్టర్లుగా కర్నాటి పెద్ద నరసింహాగౌడ్, ఫకీర్ శమంతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు పల్లె యాదయ్యగౌడ్, తోకల వెంకటయ్యగౌడ్, కర్నాటి సామయ్య, యాదయ్య, తోకల దశరథగౌడ్, అనేగొని యాదగిరిగౌడ్, తండ అశోక్, కన్నాటి జంగయ్య, తోకల నరసింహా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటినుంచి చీకటి వేంకటేశ్వరస్వామి సంబురాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కందుకూరు: పులిమామిడిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు రాజశేఖర్‌శర్మ, భాస్కర్‌శర్మ, గ్రామ పెద్దలు బి.పాండురంగారెడ్డి, వి.నారాయణ తదితరులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్‌తో కలిసి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. వీరి వెంట స్థానికులు పి.మహేష్, టి.శేఖర్ తదితరులు ఉన్నారు.



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి తదితరులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి



విద్యార్థులకు చాక్లెట్లు అందజేస్తున్న డీసీపీ

ఇబ్రహీంపట్నం రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ క్రైం, మహిళల రక్షణ, చైన్ స్నాచింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్, హెరాయిన్ లాంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని, దీని వలన విలువైన జీవితాలను కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని, లోన్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తుండాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో దోపిడీలు, దొంగతనాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో డీసీపీ సందడి చేశారు. విద్యార్థులతో సరదాగా గడిపారు. చాక్లెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఏసీపీ రాజు, సీఐ జగదీష్, యాచారం సీఐ నర్సింహారావు, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు వీరేష్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరంలో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను బీఆర్‌ఎస్ పార్టీ కై వసం చేసుకుంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో మంచె పాండుయాదవ్ ఫాంహౌస్‌లో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో తన గెలుపు కోసం కృషి చేసి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం నిరంతరం కృషి చేసి గెలిపిస్తానని తెలిపారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులను సిద్ధం చేసుకొని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఏ రిజర్వేషన్ వచ్చినా పోటీకి సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఆశావాహులు ఎన్నికల్లో పోటీచేసే ఆసక్తి కలిగిన వారు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతీ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి తెలియజేసి చైతన్యవంతం చేయాలని సూచించారు. అమలుకు నోచుకోని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. గత బీఆర్‌ఎస్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిందన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ ఎంపీటీసీ, సర్పంచ్ సీట్లు గెలుపొందేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో గెలవడానికి తీసుకోవాల్సిన కార్యాచరణ, సలహాలు, సూచనలు సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



అధికారులను అడ్డుకుంటున్న స్థానికులు

తుర్కయంజాల్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నిజాం హెచ్చరించారు. మంగళవారం తుర్కయంజాల్ రెవెన్యూ పరిధి కమ్మగూడ ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా సేవాలాల్ మహరాజ్ దేవాలయాన్ని నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సమాచారం మేరకు వనస్థలిపురం ఎస్ఐ అనిల్ కుమార్‌తో కలిసి అక్కడికి వెళ్లారు. పనులను అడ్డుకున్నారు. దీంతో కాలనీ వాసులు.. అధికారులు, పోలీసులకు అభ్యంతరం తెలిపారు. ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించినా కుదరకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. మండల సర్వేయర్ జ్యోతి ఉన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం అర్చకులు వెంకటేశ్వరశర్మ, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, వెంకటేశ్, శ్రీధర్, వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. చిన్న రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి పాల్గొన్నారు.



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న విద్యార్థులు